సాక్షి
అనంతపురం

గురువారం । 13 । జూన్ । 2024



చీనీ టన్ను రూ.38 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో బుధవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.38 వేలు పలికాయి.



పశువులు జాగ్రత్త

వర్షాకాలం నేపథ్యంలో పశువుల సంరక్షణకు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. 8లో

గరిష్టం/కనిష్టం
32.3°/23.5°

జిల్లా అంతటా బుధవారం ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పట్టాయి. ఆకాశం మేఘావృతమై పలు మండలాల్లో వర్షం కురిసింది. నైరుతి దిశగా గంటకు 8 నుంచి 12 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

గురుకులాల్లో టీచర్ పోస్టుల భర్తీకి 15న వాక్‌ఇన్



అనంతపురం ఎడ్యుకేషన్: ఉమ్మడి జిల్లాలోని ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ (అంబేడ్కర్) గురుకులాల్లో ఖాళీగా ఉండే ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి చర్యలు తీసుకుంటున్నట్లు గురుకులాల సమన్వయ అధికారి అంగడి మురళీకృష్ణ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. డెమో ద్వారా తాత్కాలిక ప్రాతిపదికన గెస్ట్/పార్ట్‌టైమ్ టీచర్స్ పోస్టులను భర్తీ చేస్తామన్నారు. ఆసక్తి గల వారు ఈనెల 15న కురుగుంట అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో జరిగే డెమో/వాక్‌ఇన్‌కు ఒరిజినల్ విద్యార్హత సర్టిఫికెట్ల (డిగ్రీ, పీజీ, టెట్, బీపీఈడీ)తో ఉదయం 10 గంటలకు హాజరుకావాలని సూచించారు. బాలికల పాఠశాలలకు మహిళలను, బాలుర పాఠశాలలకు పురుషులతో మాత్రమే భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నారు.

పాతస్థానాల్లోనే ఎంటీఎస్ టీచర్ల రిపోర్ట్

- విద్యాశాఖ కమిషనర్ సురేష్‌కుమార్ స్పష్టత

అనంతపురం ఎడ్యుకేషన్: 1998, 2008 డీఎస్సీల ఎంటీఎస్ టీచర్ల విషయంలో స్పష్టత వచ్చింది. గురువారం పాఠశాలలు రీ ఓపెన్ అవుతున్నా... వారి రెన్యూవల్ అంశంలో సందిగ్ధత నెలకొంది. ఎట్టకేలకు బుధవారం సాయంత్రం విద్యాశాఖ కమిషనర్ సురేష్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. వేసవి సెలవులకు ముందు ఏ స్కూల్‌లో అయితే పని చేశారో అదే స్కూల్‌లో వెళ్లి గురువారం రిపోర్ట్ చేసుకోవాలని సూచించారు. ఈ విషయంపై జిల్లా విద్యాశాఖ అధికారి బి.వరలక్ష్మీ మండల విద్యాశాఖ అధికారులకు సమాచారం అందించారు. ఎంటీఎస్ టీచర్లందరూ పాత స్థానాల్లోనే రిపోర్ట్ చేసుకునేలా సమాచారం ఇవ్వాలని ఆదేశించారు. 2024-25 విద్యా సంవత్సరంలో 11 నెలలు మాత్రమే పని చేసేందుకు ఎంటీఎస్ టీచర్లకు కాంట్రాక్ట్ ఇవ్వనున్నారు. ఈనెల 1 నుంచి 2025 ఏప్రిల్ 30 వరకు పని చేసేందుకు అనుమతిస్తూ విద్యాశాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం పాతస్కూళ్లల్లో రిపోర్ట్ చేసుకున్నా.. కాస్తా నిదానంగా కౌన్సెలింగ్ నిర్వహించి అవసరమైన పాఠశాలల్లో నియమించనున్నట్లు తెలిసింది.

అమ్మకానికి ఆముద విత్తనం



బుక్కరాయసముద్రం: మండలంలోని రేకులకుంటలో ఉన్న ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ పరిశోధనా స్థానంలో హైబ్రిడ్ రకం ఆముద విత్తనం విక్రయానికి సిద్ధంగా ఉంచారు. ఈ మేరకు పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ సహదేవరెడ్డి బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఐసీహెచ్-66, ఐసీహెచ్-5 హైబ్రీడ్ రకాలు అందుబాటులో ఉన్నాయి. రెండు కిలోల విత్తన ప్యాకెట్ ధర రూ.850. ఎకరా పొలానికి కిలో విత్తనం సరిపోతుంది. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని రైతులను డాక్టర్ సహదేవరెడ్డి కోరారు.

15న ఉద్యోగమేళా

కళ్యాణదుర్గం రూరల్: కళ్యాణదుర్గంలోని ఏఎఫ్ ఎకాలజీ సెంటర్‌లో ఈ నెల 15న ఉద్యోగ మేళా నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆ సెంటర్ డైరెక్టర్ వైవీ మల్లారెడ్డి ఓ ప్రకటన విడుదల చేశారు. పది, ఇంటర్, ఐటీఐ ఉత్తీర్ణత, డిగ్రీ పాస్/ఫెయిల్ అయి 16 నుంచి 25 ఏళ్ల మధ్య వయస్సు వారు అర్హులు. ఎంపికైన వారికి చిత్తూరులోని అమరరాజా స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో అప్రెంటిస్ షిప్ ప్రమోషన్ స్కీమ్ కింద స్టయిఫండ్‌తో కూడిన రెండేళ్ల శిక్షణ ఇచ్చి, అనంతరం ఉద్యోగ అవకాశం కల్పిస్తారు. ఆసక్తి ఉన్నవారు బయోడేటాతో ఉద్యోగ మేళాకు హాజరు కావచ్చు. పూర్తి సమాచారానికి 90000 24919, 87126 08589లో సంప్రదించవచ్చు.

ముచ్చటగా ముగ్గురికి..



ఉమ్మడి అనంతపురం జిల్లాకు ముచ్చటగా మూడు మంత్రి పదవులు దక్కాయి. ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్న ఒకరికి, అనూహ్యంగా తొలిసారి ఎమ్మెల్యే అయిన వారికి ఈ సారి కేబినెట్‌లో చోటు లభించింది. పార్టీలో సీనియర్లు, గతంలో మంత్రులుగా పనిచేసిన వారికి చోటు కల్పించకపోవడంతో వారు నిరాశ చెందారు. బోయ సామాజికవర్గ ఓటర్లు జిల్లాలో ఎక్కువగా ఉండగా, ఆ వర్గానికి చెందిన ఎమ్మెల్యేలకు చంద్రబాబు ఈసారి కేబినెట్‌లో ప్రాతినిధ్యం కల్పించలేదు.

- 'ఉమ్మడి అనంత'లో ముగ్గురు ఎమ్మెల్యేలకు మంత్రి యోగం
- ముగ్గురూ కొత్త వారే కావడం గమనార్హం
- ఊహించినట్లుగానే సీనియర్ ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్‌కు చోటు
- బీజేపీ కోటాలో సత్యకుమార్‌కు పదవి
- సవితకు అనూహ్యంగా అమాత్య యోగం
- సీనియర్లకు బాబు మొండిచేయి
- పరిటాల సునీత, కాలవ శ్రీనివాసులుకు నిరాశ



పేరు	: పయ్యావుల కేశవ్
పుట్టిన తేదీ	: 1965 మే 14
తల్లిదండ్రులు	: పయ్యావుల వెంకటనారాయణప్ప, పయ్యావుల ఓబుళమ్మ
స్వగ్రామం	: ఉరవకొండ మండలం కొకుంట్ల
విద్యార్హతలు	: డిగ్రీ, ఎంబీఏ
ఎమ్మెల్యేగా గెలిచింది	: ఐదుసార్లు



పేరు	: సంజీవరెడ్డిగారి సవిత
పుట్టిన తేదీ	: 1977 ఫిబ్రవరి 10
తల్లిదండ్రులు	: ఎస్. రామచంద్రారెడ్డి, గాయత్రి
స్వగ్రామం	: హనుమప్పపల్లి, రాంపురం పంచాయతీ, పెనుకొండ మండలం
విద్యార్హతలు	: డిగ్రీ
ఎమ్మెల్యేగా గెలిచింది	: తొలిసారి



పేరు	: సత్యకుమార్
పుట్టిన తేదీ	: 1971 ఆగస్టు 10
తండ్రి	: వై.నాగరాజరావు
విద్యార్హతలు	: ఎంఏ పొలిటికల్ సైన్స్
ఎమ్మెల్యేగా గెలిచింది	: తొలిసారి

సాక్షి ప్రతినిధి, అనంతపురం: సుదీర్ఘ కసరత్తు అనంతరం కేబినెట్ బెర్తులను చంద్రబాబు ఖరారు చేశారు. కొత్త జిల్లాల ప్రకారం శ్రీ సత్యసాయికి రెండు, అనంతపురం జిల్లాకు ఒక మంత్రి పదవి చొప్పున దక్కింది. బుధవారం ఈ ముగ్గురూ కృష్ణా జిల్లా కేసరపల్లిలో ప్రమాణ స్వీకారం చేశారు. త్వరలో వారికి శాఖలు కేటాయించనున్నారు.

ఎట్టకేలకు పయ్యావులకు..

ఐదు సార్లు ఎమ్మెల్యేగా ఎన్నికైన ఉరవకొండ శాసన సభ్యులు పయ్యావుల కేశవ్‌కు అందరూ ఊహించినట్టే ఈ దఫా కేబినెట్ బెర్తు దక్కింది. గతంలో ఎమ్మెల్యేగా ఎన్నికైనా కేశవ్‌కు నిరాశే ఎదురవుతూ వచ్చింది. ఆయన ఎమ్మెల్యేగా ఎన్నికైనప్పుడు రాష్ట్రంలో ఆ పార్టీ ప్రభుత్వం ఏర్పడకపోవడం, ప్రభుత్వం ఏర్పడినప్పుడు తాను ఓడిపోవడంతో అమాత్య యోగం దక్కలేదు. అయితే, ఈ దఫా కేశవ్ ఎమ్మెల్యేగా ఎన్నికవడం, రాష్ట్రంలోనూ టీడీపీ ప్రభుత్వం రావడంతో ఈసారి కేబినెట్‌లో చోటు దక్కింది. 2019-24 మధ్య కేశవ్ పబ్లిక్ అకౌంట్స్ కమిటీ (పీఏసీ) చైర్మన్‌గా పనిచేశారు.

అనూహ్యంగా తెరపైకి సవిత

పెనుకొండ నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికైన సవిత అనూహ్యంగా తెరమీదకొచ్చి మంత్రి పదవి దక్కించుకున్నారు. ఉమ్మడి జిల్లా నుంచి నలుగురు మహిళలు ఎమ్మెల్యేలుగా గెలుపొందిన క్రమంలో.. ఒక వేళ మహిళా కోటాలో మంత్రి పదవి కేటాయిస్తే పరిటాల సునీతకు వస్తుందని అందరూ భావించారు. సవితకు పదవి దక్కుతుందని ఎవరూ ఊహించలేదు. కానీ అందరి అంచనాలను తలకిందులు చేస్తూ కురుబ సామాజిక వర్గానికి చెందిన సవిత మంత్రివర్గంలో చోటు దక్కించుకున్నారు. ఆమె శాసనసభకు తొలిసారి ఎన్నికయ్యారు. సవిత భర్త కమ్మ సామాజికవర్గానికి చెందిన వారు. సామాజిక సమీకరణల్లో భాగంగానే ఆమెకు మంత్రి పదవి వరించినట్టు చర్చ జరుగుతోంది.

పయ్యావుల కేశవ్‌ది భూస్వాముల కుటుంబం. ఈయన తండ్రి వెంకటనారాయణప్ప 1975లో రాయదుర్గం నియోజకవర్గ ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. అనంతపురం జిల్లా డీసీసీ అధ్యక్షుడిగా కూడా పనిచేశారు. కేశవ్ రాజకీయ ప్రస్థానం 1994లో ప్రారంభమైంది. 29 ఏళ్ల వయసులో టీడీపీ తరఫున ఉరవకొండ నియోజకవర్గం నుంచి బరిలో నిలిచి 18 వేల ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. మొత్తంగా ఏడు సార్లు పోటీ చేసిన కేశవ్ ఐదుసార్లు (1994, 2004, 2009, 2019, 2024) ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. కేశవ్‌కు కేబినెట్ స్థానంతో 39 ఏళ్ల అనంతరం ఉరవకొండ నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందిన ఓ వ్యక్తికి మంత్రి పదవి వరించినట్లయింది. గతంలో ఇక్కడ గెలిచిన గుర్రం చిన్నవెంకన్న (1972లో), గుర్రం నారాయణప్ప(1985లో) మంత్రులుగా బాధ్యతలు నిర్వర్తించారు.

1998లో ఎస్కేయూ పరిధిలో డిగ్రీ పూర్తి చేసిన సవిత... అనంతరం టీడీపీలో చేరి పలు హోదాల్లో పని చేశారు. కొంతకాలం ప్రజారాజ్యం పార్టీలో ఉన్నారు. 2019కు ముందు టీడీపీ హయాంలో కురుబ కార్పొరేషన్ చైర్‌పర్సన్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. మంత్రి సవిత తండ్రి ఎస్. రామచంద్రారెడ్డి సైతం గతంలో రెండుసార్లు రాష్ట్ర మంత్రిగా పని చేశారు. 1983లో పెనుకొండ ఎమ్మెల్యేగా టీడీపీ తరఫున పోటీ చేసి గెలుపొందారు. ఎన్టీఆర్ కేబినెట్‌లో భారీ పరిశ్రమల శాఖ మంత్రిగా పని చేశారు. ఆ తర్వాత 1988లో మరోసారి ఎమ్మెల్యేగా గెలిచి ఎన్టీఆర్ కేబినెట్‌లో ఏకంగా 13 శాఖలకు మంత్రిగా కొనసాగారు. అప్పట్లో ఇది సంచలనంగా మారింది. తండ్రి బాటలోనే తాజాగా సవిత మంత్రివర్గంలో చోటు దక్కించుకున్నారు.

సత్యకుమార్ ప్రొద్దుటూరు మున్సిపల్ పాఠశాల, నాగర్ కర్నూలులో ప్రాథమిక విద్యను పూర్తి చేశారు. బళ్లారిలో పీయూసీ, మదనపల్లిలో ఎలక్ట్రానిక్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ డిప్లొమా పూర్తి చేశారు. మధురై కామరాజ్ యూనివర్సిటీ నుంచి పొలిటికల్ సైన్స్‌లో మాస్టర్స్ డిగ్రీ, చెన్నైలోని ఇన్‌స్టిట్యూట్ ఫర్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ నుంచి బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ కోర్సు పూర్తి చేశారు. విద్యార్థి దశలోనే ఏబీవీపీలో చేరి కళాశాల ప్రధాన కార్యదర్శిగా ఎంపికయ్యారు. 1990 నుంచి 1993 వరకు బీజేపీలో పనిచేసి గుర్తింపు తెచ్చుకున్నారు. అనంతరం వెంకయ్యనాయుడు వద్ద పనిచేశారు. బీజేపీ జాతీయ కార్యదర్శిగా నియమితులయ్యారు. బీజేపీ కర్ణాటక ఇన్‌చార్జ్‌గానూ బాధ్యతలు నిర్వహించారు. యూపీ శాసనసభ ఎన్నికల్లో కీలక బాధ్యతలు చేపట్టిన సత్యకుమార్ అండమాన్ నికోబార్ దీవుల ఇన్‌చార్జ్‌గా కూడా వ్యవహరిస్తున్నారు.రాష్ట్ర కేబినెట్‌లో ధర్మవరం ఎమ్మెల్యేకు బెర్తు దొరకడం ఇది రెండోసారి. గతంలో ఎన్టీఆర్ ప్రభుత్వంలో జి. నాగిరెడ్డి మంత్రిగా పనిచేశారు.

నెలన్నర వ్యవధిలో ఎమ్మెల్యే.. మంత్రి

అదృష్టమంటే ధర్మవరం ఎమ్మెల్యే సత్యకుమార్‌దే! రెండు నెలల క్రితం వరకూ ఆయన పేరు ఉమ్మడి జిల్లాలో చాలామందికి తెలియదు. బీజేపీ కోటాలో ఎమ్మెల్యే సీటు దక్కించుకున్న సత్యకుమార్ ధర్మవరానికి నెలన్నర క్రితమే వచ్చారు. పోటీ చేయడం, గెలుపొందడం, మంత్రి కావడం చకచకా జరిగిపోయాయి. సత్యకుమార్‌కు కేంద్ర బీజేపీ పెద్దల వద్ద మంచి పలుకుబడి ఉంది. దీంతో ఆయనకు మంత్రి పదవి సునాయాసంగా దక్కినట్టు చర్చించుకుంటున్నారు. స్వల్ప వ్యవధిలోనే విజయం సాధించడం, మంత్రి కావడం సత్యకుమార్ అదృష్టమని అంటున్నారు.

సీనియర్లకు నిరాశ

జిల్లాలో గతంలో మంత్రులుగా పనిచేసిన సీనియర్లకు ఈ దఫా నిరాశే ఎదురైంది. 2014-19 మధ్య కాలంలో కాలవ శ్రీనివాసులు గృహ నిర్మాణశాఖ మంత్రిగానూ, పరిటాల సునీత స్త్రీ శిశు సంక్షేమశాఖ మంత్రిగానూ చేశారు. దీంతో వీరిలో ఒకరికి కచ్చితంగా పదవి దక్కుతుందని అనుకున్నారు. కానీ చంద్రబాబు ఇద్దరినీ పక్కన పెట్టడంతో ఇరువురూ తీవ్ర నిరాశకు గురైనట్టు తెలుస్తోంది. బోయ సామాజికవర్గ ఓట్లు ఎక్కువగా ఉన్న అనంతపురం జిల్లాలో కచ్చితంగా ఆ సామాజిక వర్గ నేతకు చోటు ఉంటుందని భావించినా, చంద్రబాబు అటుగా మొగ్గ చూపలేదని తెలుస్తోంది.

మిడ్ పెన్నార్ డ్యాంను ఆధునికీకరించాలి

- అవసరమైన చర్యలు చేపట్టండి
- జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్



మిడ్ పెన్నార్ డ్యాంను పరిశీలిస్తున్న కలెక్టర్

గార్లదిన్నె: మండల పరిధిలోని ఎంపీఆర్ (మిడ్ పెన్నార్ రిజర్వాయర్) ఆధునికీకరణకు అవసరమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్ వినోద్‌కుమార్ అన్నారు. బుధవారం డ్యాంను ఆయన పరిశీలించారు. డ్యాంలో నీటి నిల్వ, పూర్తి స్థాయి నీటి మట్టం, ఉత్తర, దక్షిణ కాలువలు, ఆయకట్టు, గెస్ట్ హౌస్ పరిస్థితి తదితరాలపై ఆరా తీశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఎంపీఆర్ డ్యాం ఉత్తర, దక్షిణ కాలువల ఆధునికీకరణకు చర్యలు చేపట్టాలన్నారు. కాలువల పరిశీలనకు లస్కర్ల కోసం ప్రతిపాదనలు పంపించాలన్నారు. గేట్లకు మరమ్మతులు చేయించాలన్నారు. డ్యాం వద్ద టూరిజం అభివృద్ధికి ఉన్న అవకాశాలు పరిశీలించాలన్నారు. చివరి ఆయకట్టుకూ నీరు అందించాలన్నారు. గ్రామాలకు ఇబ్బంది లేకుండా తాగునీటి సరఫరా కొనసాగించాలన్నారు. లీకేజీలు జరగకుండా చూడాలన్నారు. ఈ ఏడాది ఆయకట్టుకు నీటి సరఫరా ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. అనంతరం గార్లదిన్నె తహసీల్దార్ కార్యాలయాలన్ని కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తహసీల్దార్ కార్యాలయంలో సమస్యలను సకాలంలో పరిష్కరించాలన్నారు. పోలీసు వారితో సమన్వయం చేసుకొని కలసికట్టుగా ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో హెచ్చెల్సీ ఎస్‌ఈ రాజశేఖర్, ఈఈ వెంకటరమణారెడ్డి, తహసీల్దార్ హనుమాన్‌నాయక్, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ వెంకటలక్ష్మి, సీఐ శ్రీధర్, ఎస్‌ఐ మహమ్మద్ గౌస్, డిప్యూటీ తహసీల్దార్ విజయ కుమార్, వ్యవసాయ అధికారి సోమశేఖర్ పాల్గొన్నారు.

పచ్చదనం సంతరించుకోవాలి

అనంతపురం అర్బన్: అధికారుల బంగ్లాల పరిసరాలు, రోడ్లకు ఇరువైపులా పచ్చదనం సంతరించుకునేలా చెట్లు, మొక్కల పెంపకం చేపట్టాలని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టర్ బుధవారం కలెక్టర్ బంగ్లాతో పాటు అధికారుల బంగ్లాలు ఉన్న ప్రాంత పరిసరాల్లో పర్యటించారు. ఆయా చోట్ల మొక్కల పెంపకంపై అధికారులకు ఆయన తగిన సూచనలు, ఆదేశాలిచ్చారు. అధికారుల క్యాంపు కార్యాలయాల ఎదురుగా ప్రధాన రోడ్డు వరకు ఎంపిక చేసిన వివిధ రకాల మొక్కలను నాటాలని చెప్పారు. కార్యక్రమంలో నగర పాలక సంస్థ కమిషనర్ మేఘ స్వరూప్, నగర పాలక ఉద్యాన శాఖ ఏడీ లక్ష్మిప్రసన్న, తహసీల్దారు శివరామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సెలవులకు టాటా.. బడి బాట





అనంతపురంలోని ఓ బుక్ షాపు వద్ద బుధవారం విద్యాసామగ్రి కొనుగోలు చేస్తున్న దృశ్యం, పల్లెల నుంచి నగరానికి చేరుకుంటున్న విద్యార్థులు

- నేడు మోగనున్న బడిగంట
- అరకొరగా చేరిన స్టూడెంట్ కిట్లు
- మండల కేంద్రాల నుంచి బడులకు వెళ్లాలంటే మరింత సమయం

అనంతపురం ఎడ్యుకేషన్: వేసవి సెలవుల అనంతరం గురువారం బడిగంట మోగనుంది. అన్ని యాజమాన్యాల విద్యా సంస్థలకు ఏప్రిల్ 23 నుంచి సెలవులు వదిలారు. వాస్తవానికి బుధవారం నుంచే పాఠశాలలు పునఃప్రారంభం కావాల్సి ఉండగా.. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం కారణంగా ఒకరోజు ఆలస్యంగా ప్రారంభమవుతున్నాయి. ఇందుకోసం విద్యాశాఖ అధికారులు, ఎంఈఓలు, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేస్తున్నారు. జిల్లా విద్యాశాఖ అధికారి బి.వరలక్ష్మీ బుధవారం సాయంత్రం అనంతపురం కేఎస్‌ఆర్ ప్రభుత్వ బాలికల పాఠశాలలో మండల విద్యాశాఖ అధికారులతో సమీక్షించారు. పాఠశాలల్లో అన్ని వసతులు కల్పించేలా చూడాలని ఆదేశించారు. స్కూళ్లలో తరగతి గదులన్నీ శుభ్రం చేయించాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నాడు-నేడు పనుల కోసం ఎక్కడైనా గుంతలు తవ్వి ఉంటే వాటిని వెంటనే మూయించాలన్నారు. నీళ్ల చేరి పిల్లలు పడే ప్రమాదముంటుందని హెచ్చరించారు. కరెంటు తీగల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అన్ని అంశాలపై ప్రధానోపాధ్యాయులను అప్రమత్తం చేయాలని ఆదేశించారు.

అరకొరగా స్టూడెంట్ కిట్లు

జిల్లాలో 1,735 ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు, మునిసిపల్ స్కూళ్లు, కేజీబీవీలు, మోడల్ స్కూళ్లు, రెసిడెన్షియల్ స్కూళ్లు ఉన్నాయి. వీటిల్లో 1-10 తరగతుల విద్యార్థులు దాదాపు 1.80 లక్షల మంది చదువుతున్నారు. స్కూల్ ప్రారంభం నాటికి విద్యార్థులకు 'విద్యాకానుక కిట్లు' ఇవ్వాల్సి ఉండగా ఇప్పటిదాకా జిల్లాకు అరకొరగానే సరఫరా అయ్యాయి. ప్రభుత్వం మారడంతో 'స్టూడెంట్ కిట్లు'గా మార్చారు. నోట్ బుక్స్, పాఠ్యపుస్తకాలు, షూ, బెల్టు, బ్యాగులు, యూనిఫాం, డిక్షనరీలు ఇవ్వాల్సి ఉంది. ఇప్పటికీ చాలా వస్తువులు జిల్లాకు పూర్తిస్థాయిలో రాలేదు. అరకొరగానే వచ్చాయి. మండలాల్లో కిట్లు సిద్ధం చేసి పాఠశాలలకు చేర్చాల్సిన బాధ్యత ఎంఈఓలదేనని డీఈఓ వరలక్ష్మీ స్పష్టం చేశారు.

బుక్‌స్టాళ్లు కిటకిట

వేసవి సెలవులు ముగిసిన నేపథ్యంలో పిల్లలకు అవసరమైన సామగ్రి కొనుగోలుదారులతో జిల్లావ్యాప్తంగా బుక్‌స్టాళ్లు కిటకిటలాడుతున్నాయి. తల్లిదండ్రులు బుక్‌స్టాళ్లకు క్యూ కట్టారు. పుస్తకాలు, పెన్నులు, యూనిఫాం తదితర సామగ్రి కొనుగోలు చేశారు.

బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించాలి

అనంతపురం అర్బన్: బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కలెక్టర్ వి.వినోద్ కుమార్ అన్నారు. ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడి ఈడు పిల్లలు ఏ ఒక్కరూ బాల కార్మికునిగా మారకూడదన్నారు. వారంతా తప్పనిసరిగా బడిలోనే ఉండాలన్నారు. బాలలను పనిలో పెట్టుకుంటే సంబంధిత యజమానులు, సంస్థలపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దుకాణాలు, మెకానిక్ షెడ్‌లు, ఇటుకబట్టీలు, తదితర చోట్ల బాలకార్మికులుగా ఉన్న పిల్లలను గుర్తించి వారిని తిరిగి బడిలో చేర్పించాలన్నారు. బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు లైన్ డిపార్ట్‌మెంట్‌లు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అనంతరం పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో స్త్రీశిశు సంక్షేమ శాఖ పీడీ శ్రీదేవి, బాలల పరిరక్షణ సమితి అధికారి మంజునాథ్, ప్రొటెక్షన్ అధికారి వెంకటేశ్వరి, చైల్డ్ లైన్ కోఆర్డినేటర్ కృష్ణమాచారి, కార్మిక శాఖ అధికారి లక్ష్మీనరసయ్య, రఘురాములు, సిబ్బంది వసంత, కమాలాక్షి, ఇర్ఫాన్, సుహాసిని పాల్గొన్నారు.

● 30 మండలాల్లో వర్షం

అనంతపురం అగ్రికల్చర్: జిల్లాలో వర్షాలు కొనసాగుతున్నాయి. మంగళవారం రాత్రి నుంచి బుధవారం ఉదయం వరకు 30 మండలాల పరిధిలో 9 మి.మీ సగటు నమోదైంది. పామిడి 31.2 మి.మీ, వజ్రకరూరు 26.2 మి.మీ, గుమ్మఘట్ట 23.4 మి.మీ, కణేకల్లు 21 మి.మీతో పాటు విడపనకల్లు, తాడిపత్రి, పుట్లూరు, నార్పల, శెట్టూరు, ఉరవకొండ తదితర మండలాల్లో మోస్తరుగా వర్షం కురిసింది. ఆత్మకూరు, కళ్యాణదుర్గం మినహా జిల్లా అంతటా వర్షపాతం నమోదైంది. జూన్ నెల సాధారణ వర్షపాతం 61 మి.మీ కాగా ఇప్పటికే 110 మి.మీ పైబడి వర్షపాతం నమోదైంది. బుధవారం సాయంత్రం నుంచి రాత్రి వరకు కూడా పలు మండలాల్లో వర్షం కురిసింది. రాగల మూడు రోజులూ జిల్లాకు వర్షసూచన ఉన్నట్లు రేకులకుంట వ్యవసాయ పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ బి.సహదేవరెడ్డి, వాతావరణ విభాగం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ జి.నారాయణస్వామి బుధవారం విడుదల చేసిన బులెటిన్‌లో తెలిపారు. అక్కడక్కడా 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు, అలాగే ఉరుములు, మెరుపులతో మోస్తరుగా వర్షం నమోదు కావచ్చని పేర్కొన్నారు. గరిష్ట ఉష్ణోగ్రతలు 29.8 నుంచి 36 డిగ్రీలు, కనిష్ఠం 22.2 నుంచి 24.7 డిగ్రీలు నమోదు కావచ్చన్నారు. గాలిలో తేమ శాతం ఉదయం 68 నుంచి 88, మధ్యాహ్నం 60 నుంచి 74 శాతం మధ్య రికార్డు కావచ్చన్నారు. నైరుతి దిశగా గంటకు 8 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉందని తెలిపారు.



కణేకల్లు మండలం ఎన్.హనుమాపురం వద్ద వంకలో ప్రవహిస్తున్న వాన నీరు



సంగీత కచేరీ నిర్వహిస్తున్న హరియాణా, చండీఘడ్ భక్తులు

సత్యసాయికి నృత్యాంజలి

ప్రశాంతి నిలయం: భక్తులు సత్యసాయికి నృత్యాంజలి సమర్పించారు. పర్తియాత్రలో భాగంగా పుట్టపర్తికి విచ్చేసిన హరియాణా, చండీఘడ్ భక్తులు ప్రశాంతి నిలయంలోని సాయికుల్వంత్ సభా మందిరంలో సత్యసాయి మహాసమాధి చెంత సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. బుధవారం ఉదయం 'శ్రీ సత్యసాయి శరణం మమ' పేరుతో సంగీత కచేరీ నిర్వహించారు. సత్యసాయిని కీర్తిస్తూ పాడిన పాటలు భక్తులను అలరించాయి. సాయంత్రం కురుక్షేత్రలోని నటరాజ్ సంగీత నృత్య విద్యాలయ విద్యార్థులు 'నృత్యాంజలి' పేరుతో కథక్ నృత్య ప్రదర్శన నిర్వహించారు. చక్కటి నృత్య భంగిమలతో నిర్వహించిన నృత్య ప్రదర్శన చూసి భక్తులు మైమరచిపోయారు.



కథక్ నృత్య ప్రదర్శనలోని ఘట్టం

క్లుప్తంగా

దోమల నివారణ చర్యలు చేపట్టండి : డీఎంఓ


మలేరియా సబ్ యూనిట్ అధికారులకు సూచనలిస్తున్న డీఎంఓ ఓబులు

అనంతపురం మెడికల్: వర్షాకాలంలో దోమల నివారణ చర్యలు చేపట్టాలని మలేరియా సబ్ యూనిట్ అధికారులకు డీఎంఓ ఓబులు సూచించారు. బుధవారం డీఎంహెచ్ఓ కార్యాలయంలో సబ్ యూనిట్ అధికారులతో ఆయన సమావేశమై మాట్లాడారు. డెంగీ, మలేరియా, చికున్‌గున్యా ప్రబలకుండా తీసుకోవాల్సిన చర్యలు వివరించారు. దోమకాటు వ్యాధులపై ప్రజలను చైతన్య పరచాలన్నారు. హైరిస్క్ ప్రాంతాలపై ప్రత్యేక దృష్టిసారించి జ్వరాలు నమోదైతే రక్తపూతలు తీసి పరీక్షలు చేయించాలన్నారు. మలేరియా వ్యతిరేక మాసోత్సవాల్లో భాగంగా ఏదో ఒక గ్రామంలో ర్యాలీ, సమావేశాలు నిర్వహించాలన్నారు. వారంలో ఒక రోజు డ్రైడే పాటించేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో ఏఎంఓ కె.సత్యనారాయణ, ఎంపీహెచ్ఓలు గిరిధర్‌రెడ్డి, రమేష్, కోదండరామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు. అనంతరం నగరంలో చేపట్టిన దోమల నివారణ చర్యలను పరిశీలించారు. వసతి గృహాల్లో మలాథియాన్ పిచికారీకి చర్యలు తీసుకున్నారు.

ప్రమాదంలో యువకుడి మృతి


మృతుడు తేజ

గుంతకల్లు రూరల్: స్థానిక జాతీయ రహదారిపై చోటు చేసుకున్న ప్రమాదంలో కర్నూలు జిల్లాకు చెందిన ఓ యువకుడు దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు... కర్నూలు జిల్లా చిప్పగిరి మండలం నగరడోణకు చెందిన పెద్దయ్య కుమారుడు తేజ (21) తన తల్లిదండ్రులతో కలసి కొంత కాలంగా వైఎస్సార్ జిల్లా కడపలో ఉంటూ అక్కడే వ్యాపారం ద్వారా జీవనం సాగిస్తున్నాడు. రెండేళ్ల క్రితం ఆయనకు శిరీషతో వివాహమైంది. ప్రస్తుతం ఆమె గర్భిణి. దీంతో సీమంతం నిర్వహించేందుకు తేదీ నిశ్చయం చేసుకుని బంధుమిత్రులను ఆహ్వానించేందుకు స్కూటీపై బయలుదేరాడు. మంగళవారం రాత్రి గుంతకల్లు మండలం నక్కనదొడ్డి వద్ద ప్రయాణిస్తుండగా జాతీయ రహదారిపై ఎదురుగా వచ్చిన లారీకి సైడ్ ఇచ్చే క్రమంలో పక్కనే ఉన్న మట్టి దిబ్బను చీకట్లో గుర్తించలేక దానిపైకి స్కూటీని ఎక్కించాడు. దీంతో వాహనం అదుపు తప్పి లారీ వెనుక చక్రాల కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటనపై గుంతకల్లు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

వర్షాకాలంలో పశువులు జాగ్రత్త

- గొంతువాపు, జబ్బవాపు, గాలికుంటు వ్యాధులు ప్రబలే ప్రమాదం
- పొదుగువాపు, పిడుదులు, గోమార్లు నుంచి రక్షించుకోవాలి
- ఎద సమయంలో పునరుత్పత్తికి అనువైన వాతావరణం కల్పించాలి
- పశువ్యాధుల నివారణకు 35.93 లక్షల ఉచిత టీకాలు
- పశుగ్రాసం సమస్య లేకుండా సుబాబుల్, అవిశ లాంటివి వేసుకోవాలి
- పశుసంవర్ధక శాఖ జేడీ సుబ్రహ్మణ్యం, శింగనమల ఏడీ పద్మనాభం


గాలికుంటు వ్యాధి లక్షణాలు


గిట్టల మధ్య పుండ్లు ఏర్పడిన దృశ్యం


నోటిలో పుండ్లు ఏర్పడిన దృశ్యం

అనంతపురం అగ్రికల్చర్: వర్షాకాలంలో పాడి, పశుపోషణ విషయంలో సరైన జాగ్రత్తలు తీసుకోవాలని రైతులకు పశుసంవర్ధకశాఖ జేడీ డాక్టర్ వై.సుబ్రహ్మణ్యం, శింగనమల ఏడీ డాక్టర్ జి.పద్మనాభం తెలిపారు. ఈ సారి సీజన్ మొదట్లోనే విస్తారంగా వర్షాలు పడుతుండటం శుభపరిణామమన్నారు. పశుగ్రాసానికి ఇబ్బంది ఉండదన్నారు. అయితే పశుసంరక్షణ విషయంలో మాత్రం అప్రమత్తంగా ఉండాలన్నారు.

వ్యాధులు ప్రబలే అవకాశం..

వర్షాకాలంలో సాధారణంగా పశువుల్లో గొంతువాపు, జబ్బవాపు, పొదుగువాపు, చిటుకురోగం, గాలికుంటు వ్యాధులు ప్రబలే అవకాశం ఉంటుంది. వీటి నివారణకు అన్ని ప్రభుత్వ వెటర్నరీ ఆసుపత్రుల్లో టీకాలు అందుబాటులో ఉంచారు. వీటిని సద్వినియోగం చేసుకోవాలని జేడీ డాక్టర్ వై.సుబ్రహ్మణ్యం, ఏడీ డాక్టర్ జి.పద్మనాభం పిలుపునిచ్చారు. ఈ ఏడాదికి ఇప్పటి వరకూ అనంతపురం జిల్లాలో ఏకంగా 35.93 లక్షల టీకాలను ఉచితంగా వేయడం జరిగిందన్నారు. ఇంకా ఏవైనా లక్షణాలు కనిపించిన వెంటనే పశుశాఖ అధికారులు, వైద్యులు, గోపాలమిత్రలను సంప్రదించి టీకాలు, వైద్య సహాయం తీసుకోవాలని సూచించారు.

ఈ ఏడాది జిల్లాలో ఇప్పటి వరకూ పశువులకు అందజేసిన ఉచిత టీకాల వివరాలు	
గాలికుంటు వ్యాధి నివారణకు (ఎఫ్ఎండీ)	3,32,676 టీకాలు
పారుడురోగం (పీపీఆర్)	26,01,988 టీకాలు
ముద్దచర్మవ్యాధి (ఎల్ఎస్‌డీ)	1,64,428 టీకాలు
జబ్బవాపు (బీక్యూ)	5,832 టీకాలు
చిటుకురోగం (ఈటీ)	4,87,255 టీకాలు
గొంతువాపు (హెచ్ఎస్)	1,028 టీకాలు

వ్యాధులు... లక్షణాలు ఇవే...

- గేదెలలో వచ్చే ప్రధాన వ్యాధుల్లో గొంతువాపు ముఖ్యమైనది. అరుదుగా ఆవులకు వ్యాపిస్తుంది. బ్యాక్టీరియా కారణంగా వచ్చే ఈ వ్యాధి కలుషితమైన గడ్డి, నీరు వల్ల వ్యాప్తి చెంది, ఒకదాని నుంచి మరొకదానికి విస్తరిస్తుంది. వ్యాధి బారిన పశువు అధిక జ్వరం, గొంతు కింద వాపు, మేత మేయకపోవడం, పాలు తగ్గడం, శ్వాస సరిగా తీసుకోలేక చివరకు మృత్యువాత పడే ప్రమాదముంది. లక్షణాలు కనిపించిన వెంటనే అప్రమత్తం కావాలి.
- ఆవు జాతి పశువుల్లో జబ్బవాపు ఎక్కువగా వస్తుంది. ఇది కూడా కలుషిత గడ్డి, నీరు కారణంగా బ్యాక్టీరియా వ్యాప్తి చెంది విస్తరిస్తుంది. అధిక జ్వరం, తొడ, జబ్బ కండరాల్లో వాపు వచ్చి ఆయా ప్రాంతాలు కుళ్లిపోతాయి. ఈ వ్యాధి బారిన పడిన పశువులు కేవలం మూడు నాలుగు రోజుల్లోనే మృత్యువాతపడే అవకాశం ఉన్నందున ముందస్తుగా టీకాలు వేయించాలి. అలాగే ఉన్నఫలంగా చనిపోయే చిటుకురోగం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలి.
- వైరస్ కారణంగా ఆవులు, గేదెల్లో గాలికుంటు వ్యాధి ప్రబలుతుంది. దీనినే నోటిపుండ్లు, గిట్ట పుండ్ల వ్యాధిగా పిలుస్తారు. అధిక జ్వరంతో బాధపడతాయి. నోరు, గిట్టల మధ్య పుండ్లు ఏర్పడతాయి. నోటి నుంచి చొంగ కారుతుంది. మేత సక్రమంగా తినలేకపోతాయి. పాల దిగుబడి తగ్గిపోతుంది. కలుషిత మేత, నీరు, గాలి ద్వారా ఈ వ్యాధి వ్యాపిస్తుంది. మరణాల శాతం తక్కువగా ఉన్నా... పాడి తగ్గిపోవడం, పునరుత్పత్తిపై ప్రభావం చూపించే ప్రమాదం ఉంది. సకాలంలో టీకాలు, వైద్య చికిత్స చేయించాలి.
- వర్షాకాలంలో సాధారణంగా పిడుదులు, గోమార్ల నుంచి బేబిసియా, థయేలేరియా, అనాప్లాస్మా లాంటి వ్యాధులు సంభవిస్తాయి. పిడుదులు, గోమార్ల నుంచి పశువులు, గేదెలను కాపాడుకోవాలి. అలాగే వర్షాకాలంలో సాధారణంగా షెడ్లలోనే ఎక్కువ సమయం ఉండడం వల్ల పొదుగువాపు వచ్చే అవకాశం ఉంటుంది. షెడ్లలో తేమ లేకుండా పొడి వాతావరణం ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలి. పాలు పిండిన వెంటనే కనీసం అరగంట తర్వాత కాని పడుకోకుండా చూసుకోవాలి.
- పశువులు ఎదకు రావడం, పునరుత్పత్తికి వర్షాకాలం అనువైన సమయం. ఎదకు వచ్చిన పశువులు, గేదెల పోషణలో జాగ్రత్తలు తీసుకోవాలి. పశువులకు కృత్రిమ గర్భధారణ చేయించాలి. ఇక పశుగ్రాసం సమస్య తలెత్తకుండా పొలాలు, పొలం గట్ల మీద, షెడ్ల పరిసరాల్లో సుబాబుల్, అవిశెతో పాటు ధాన్యపు జాతి, కాయ జాతి పశుగ్రాసాలను పెంచాలి. ఎండుగడ్డితో పాటు పచ్చిగడ్డి ఎప్పుడూ అందుబాటులో ఉండేలా చూసుకుంటే పశుపోషణ అత్యంత లాభదాయకం ఉంటుంది.

ఎస్కేయూలో పరిశోధనలకు ఊతం

- రూ.70 లక్షల విలువ చేసే ప్రాజెక్టుల మంజూరు
- ఇందులో రూ. 30 లక్షల నిధులు విడుదల చేసిన యూజీసీ
- మొత్తం 14 పరిశోధన ప్రాజెక్టుల కేటాయింపు
- రెండేళ్ల వ్యవధిలో ప్రాజెక్టులు పూర్తి చేయాలని నిర్దేశం

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయానికి నూతనంగా 14 పరిశోధన ప్రాజెక్టులు దక్కాయి. ఏకంగా రూ.70 లక్షల విలువ చేసే ప్రాజెక్టులు రావడంతో పరిశోధన విద్యార్థుల్లో ఆశలు చిగురించాయి. తద్వారా వర్సిటీ పరిశోధనలకు మంచి గుర్తింపు రానుంది. రాష్ట్రీయ ఉచ్ఛతార్ శిక్షా అభియాన్(రూసా) కింద నూతన పరిశోధన ప్రాజెక్టులు మంజూరు కావడం గమనార్హం. మొత్తం 14 పరిశోధన ప్రాజెక్టులకు గాను రూ.70 లక్షలను యూజీసీ కేటాయించగా... ఇందులో రూ. 30,80,000 నిధులు విడుదల చేసింది. 2026, మే నాటికి ఈ ప్రాజెక్టులు పూర్తి చేయాలని నిబంధన విధించారు.

పరిశోధన ప్రాజెక్టులు ఇవే...			
ప్రిన్సిపల్ ఇన్విస్టిగేటర్	సబ్జెక్టు	ప్రాజెక్ట్ విలువ	విడుదలైన మొత్తం
డాక్టర్ నరేంద్ర మద్దు	బయోకెమిస్ట్రీ	రూ.8 లక్షలు	రూ.3,52,000
డాక్టర్ చింతా సుధాకర్	బయోకెమిస్ట్రీ	రూ.7 లక్షలు	రూ.3,08,000
డాక్టర్ కె.అనిత	కెమిస్ట్రీ	రూ.5 లక్షలు	రూ.2,20,000
డాక్టర్ జి.శోభాలత	మేథమేటిక్స్	రూ.10 లక్షలు	రూ.4,40,000
డాక్టర్ ఎల్.శివశంకరరెడ్డి	ఫిజిక్స్	రూ.10 లక్షలు	రూ.4,40,000
ప్రొఫెసర్ జి.వెంకటనాయుడు	ఎకనామిక్స్	రూ.3 లక్షలు	రూ.1,32,000
ప్రొఫెసర్ ఎ.కృష్ణకుమారి	జాగ్రఫీ	రూ.3 లక్షలు	రూ.1,32,000
ప్రొఫెసర్ దాశరథి రవీంద్ర	లైబ్రరీ సైన్సెస్	రూ.4 లక్షలు	రూ.1,76,000
డాక్టర్ ఎంవీ శ్రీనివాసన్	ఫిజికల్ ఎడ్యుకేషన్	రూ.5 లక్షలు	రూ.2,20,000
డాక్టర్ డి.చంద్రమౌళి రెడ్డి	పొలిటికల్ సైన్సెస్	రూ.3 లక్షలు	రూ.1,32,000
డాక్టర్ చాగంటి రామిరెడ్డి	సోషియాలజీ	రూ.3 లక్షలు	రూ.1,32,000
డాక్టర్ ఎస్.ఆర్.సదాశివారెడ్డి	తెలుగు	రూ.3 లక్షలు	రూ.1,32,000
ప్రొఫెసర్ జి.నరసింహన్	తెలుగు	రూ.3 లక్షలు	రూ.1,32,000
ప్రొఫెసర్ జి.బాలసుబ్రహ్మణ్యం	తెలుగు	రూ.3 లక్షలు	రూ.1,32,000

క్యాన్సర్‌ను నయం చేసేలా



ఎర్ర రక్త కణాలు, ప్లేట్ లెట్స్, తెల్ల రక్తకణాల్లో వచ్చే క్యాన్సర్లను గుర్తించి వాటిని నిర్మూలించే దిశగా పరిశోధనలు చేసేలా ప్రాజెక్ట్ మంజూరు చేశారు. విజాడసైజా అబెక్టైసైడ్, కోర్‌ప్సిస్ లాన్సిఓలేటా లాంటి ఔషధ మొక్కలను వినియోగిస్తే క్యాన్సర్ తగ్గడానికి అవకాశం ఉందని పరిశోధనల్లో ప్రాథమికంగా నిర్ధారణ అయింది. ఈ అంశంపై మరింత లోతైన పరిశోధన చేయడానికి ఈ ప్రాజెక్ట్‌ను కేటాయించారు.

– డాక్టర్ నరేంద్ర మద్దు, బయోకెమిస్ట్రీ

అల్గరిథమ్‌పై పరిశోధన



మేథమేటిక్స్‌లో అల్గరిథమ్‌పై అధ్యయనం చేయడానికి నూతన ప్రాజెక్ట్‌ను కేటాయించారు. ఆప్టిమైజేషన్ ఆఫ్ ప్రాసెస్ పారామీటర్స్ యూసింగ్ డిఫరెంట్ స్టాటిస్టికల్ డిజైన్ బై డెవలపింగ్ ఇంప్రూవ్డ్ అల్గరిథమ్స్' అంశంపై అధ్యయనం చేయనున్నాం. అగ్రికల్చర్, బయోటెక్నాలజీ, థర్మల్ ఇంజినీరింగ్, డిజైన్ ఇంజినీరింగ్ రంగాల్లో ఎదురవుతున్న సవాళ్లను ఎదుర్కొనేందుకు అల్గరిథమ్ ఏ మేరకు దోహదపడుతుందో పరిశోధన చేయనన్నాం.

– ప్రొఫెసర్ జి.శోభాలత, మేథమేటిక్స్ విభాగాధిపతి, ఎస్కేయూ

సంపూర్ణ ఆరోగ్యం పెంపొందించే దిశగా



యోగాసనాలతో మహిళా ఆరోగ్యాన్ని ఎలా పెంపొందించుకోవాలనే అంశంపై పరిశోధన ప్రాజెక్టును మంజూరు చేశారు. ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగంలో రూ.5 లక్షలతో ఈ ప్రాజెక్ట్ నిర్వహించాలని నిర్దేశించారు. యోగాసనాలు, ఎరోబిక్ ట్రెనింగ్‌తో బ్లడ్ లిపిడ్ ప్రొఫైల్ మీద ఎలా ప్రభావం చూపిస్తుంది, కొలస్ట్రాల్‌ను ఎలా నియంత్రించాలనే అంశాలపై పరిశోధనలు చేయనున్నాం.

– డాక్టర్ ఎంవీ శ్రీనివాసన్, ఫిజికల్ ఎడ్యుకేషన్, అండ్ స్పోర్ట్స్ సైన్సెస్

పర్వతారోహణకు చరణ్‌సాయి


పర్వతారోహణలో శిక్షణ పొందుతున్న చరణ్‌సాయి

చెన్నేకొత్తపల్లి: మండలంలోని కనుముక్కల గ్రామానికి చెందిన చరణ్‌సాయి పర్వతారోహణకు ఎంపికయ్యాడు. ప్రస్తుతం అతను లడాక్‌లో శిక్షణ పొందుతున్నట్లు ఉపాధ్యాయురాలు వెంకటలక్ష్మి తెలిపారు. ప్రత్యేక అవసరాలు గల పిల్లల్లో ఆత్మస్థైర్యం నింపేందుకు కేంద్ర ప్రభుత్వం పలు కార్యక్రమాలు చేపడుతోంది. ఈ క్రమంలోనే పర్వతారోహణపై శిక్షణ ఇస్తోంది. ఇందుకోసం దేశవ్యాప్తంగా శిక్షణ శిబిరాలు నిర్వహిస్తోంది. ఈనెల 7 నుంచి 11వ తేదీ వరకు ప్రత్యేక అవసరతలు గల పిల్లలకు ఆర్డీటీ ఆధ్వర్యంలో శిక్షణ తరగతులను నిర్వహించగా, మండలంలోని కనుముక్కల జెడ్పీ హైస్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న చరణ్‌సాయి ప్రతిభ కనబరిచాడు. దీంతో అధికారులు అతన్ని ఎంపిక చేసి గండికోటలో నిర్వహించన రాష్ట్ర స్థాయి పర్వతారోహణ పోటీలకు పంపారు. ఇక్కడా చరణ్‌సాయి అత్యుత్తమ ప్రతిభ కనబరచడంతో నిర్వాహకులు జాతీయ స్థాయికి ఎంపిక చేశారు. ప్రస్తుతం చరణ్‌సాయి లడాక్‌లో జరగనున్న పర్వతారోహణ శిక్షణ శిబిరంలో పాల్గొంటున్నారు. చరణ్‌సాయిను మండల విద్యాశాఖ అధికారులు మున్వర్ బాషా, ప్రసన్నకుమార్ నాయుడు అభినందించారు.

ఆర్టీసీని అభివృద్ధి బాటలో నడపాలి

- కలెక్టర్ వినోద్‌కుమార్



అనంతపురం అర్బన్: ఏపీఎస్ ఆర్టీసీని అభివృద్ధి బాటలో నడపాలని సంబంధిత అధికారులను కలెక్టర్ వి.వినోద్‌కుమార్ ఆదేశించారు. ఆర్టీసీ బస్సులో ప్రయాణికులకు సురక్షిత, సౌకర్యవంతమైన సేవలు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆర్టీసీ కార్యాకలాపాలపై బుధవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో ఆర్టీసీ, ఇతర శాఖల అధికారులతో ఆయన సమీక్షించారు. ఆర్టీసీ కార్యకలాపాలు, కార్యక్రమాలు, విధానాలను అడిగి తెలుసుకున్నారు. ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం సురక్షితం అనే విషయాన్ని ప్రజలకు వివిధ రూపాల్లో తెలియజేయాలన్నారు. రాయితీ పాసులపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలన్నారు. అనంతపురం నుంచి హైదరాబాద్, బెంగుళూరు నగరాలకు వోల్వా బస్సులను ఏర్పాటు చేసేలా ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపించాలన్నారు. బస్సుల కండిషనింగ్‌పై నిరంతర నిఘా ఉండాలన్నారు. వాన వస్తే బస్సులోకి వర్షపు నీరు రాకుండా బస్సుల కిటీకి అద్దాలు సరిగ్గా ఉండేలా చూడాలన్నారు. సీట్లు సౌకర్యవంతంగా ఉండాలన్నారు. కండక్టర్లు, డ్రైవర్ల నైపుణ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమాలు విస్తృతం చేయాలన్నారు. బస్టాండుల్లో తినుబండారాలు నాణ్యతగా ఉండేలా చూడాలని, అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బస్టాండు, దాని పరిసర ప్రాంతాల్లో పరిశుభ్రమైన వాతావరణం ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఆర్టీసీ రీజనల్ మేనేజర్ సుమంత్, డీపీఓ ప్రభాకర్‌రావు, ఆర్ డబ్ల్యూఎస్ ఎస్ఈ ఇహసాన్‌బాషా, డ్వామా పీడీ వేణుగోపాలరెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

కనిపించని ప్లాస్టిక్ నియంత్రణ

- మున్నాళ్ల ముచ్చటగా తనిఖీలు
- అధికారుల తీరుపై కలెక్టర్ సీరియస్


అనంతపురంలోని రాజు రోడ్డులోని దుకాణంలో తనిఖీలు నిర్వహిస్తున్న ఎంహెచ్ఓ డాక్టర్ విష్ణుమూర్తి

అనంతపురం కార్పొరేషన్: జిల్లాలో ప్లాస్టిక్ నియంత్రణ ఎక్కడేగాని కనిపించడం లేదు. అనంతపురం నగరంలో ఈ పరిస్థితి మరీ దారుణంగా మారింది. ధనార్జనే ధ్యేయంగా కొందరు వ్యాపారులు మాఫియా తరహాలో నిషేధిత ప్లాస్టిక్ విక్రయాలు కొనసాగిస్తున్నారు. నగరపాలక సంస్థ అధికారులు దాడులు చేయడం, రోజుల వ్యవధిలోనే మళ్లీ విక్రయాలు సాగించడం పరిపాటిగా మారిపోయింది. నగరంలోని పాతూరు, కమలానగర్, తదితర ప్రాంతాల్లో ప్లాస్టిక్ విక్రయాలు జరిపే పెద్ద షాపులున్నాయి. వీటి ద్వారా జిల్లా వ్యాప్తంగా పలు ప్రాంతాలకు నిషేధిత ప్లాస్టిక్ సరఫరా అవుతోంది. ఆయా దుకాణాలపై చర్యలు తీసుకోవడంలో నగరపాలక సంస్థ అధికారులు వెనుకంజ వేస్తున్నారు. ఇదే అంశంపై కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్లాస్టిక్ నిషేధంపై గట్టి చర్యలు చేపట్టాలని నగరపాలక సంస్థ కమిషనర్ మేఘస్వరూప్‌ను ఆదేశించారు. ఈ క్రమంలో ఈ నెల 11 నుంచి అధికారులు స్పెషల్ డ్రైవ్ చేపట్టారు.

బెదిరింపులతో వెనక్కు తగ్గిన అధికారులు..

నగరంలోని పాతూరు, కమలానగర్ తదితర ప్రాంతాల్లో దాదాపు 16 ప్లాస్టిక్ విక్రయ దుకాణాలు ఉన్నాయి. గతేడాది ఏప్రిల్ 4న అప్పటి అదనపు కమిషనర్ రమణారెడ్డి నేతృత్వంలో రెవెన్యూ, పొల్యూషన్ బోర్డు అధికారులు రాజు రోడ్డులో తనిఖీలు చేపట్టి ఒకటిన్నర టన్ను ప్లాస్టిక్‌ను సీజ్ చేసి, తాడిపత్రి అల్ట్రాటెక్ కంపెనీకి పంపారు. అప్పట్లో ఈ అంశంపై బీజేపీ నాయకులు ఓవరాక్షన్ చేశారు. నగరపాలక సంస్థ కార్యదర్శిగా పనిచేస్తున్న సంగం శ్రీనివాసులు, ఇతర అధికారులపై బెదిరింపులకు దిగారు. సేట్ల జోలికెళితే బట్టలూడదీసి తంతామని హెచ్చరించారు. దీంతో అధికారులు వెనుకంజ వేశారు. అప్పటి నుంచి నగరంలో ప్లాస్టిక్ విక్రయాలు జోరందుకున్నాయి.

స్పెషల్‌డ్రైవ్ షురూ..

నగర పాలక సంస్థ కమిషనర్ మేఘస్వరూప్ ఆదేశాలతో అధికారులు ప్లాస్టిక్ నియంత్రణకు స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. 50 మైక్రాన్ల కంటే తక్కువ మందం గల ప్లాస్టిక్ బ్యాగ్‌లు వాడే వారికి రూ.250 నుంచి రూ.500 వరకు జరిమానా, ప్లాస్టిక్ సంచుల విక్రేతలకు రూ.2500 నుంచి రూ.5వేలు, తయారీదారులకు రూ.50 వేల చొప్పున జరిమానా విధించేలా కార్యాచరణ రూపొందించారు. ఈ మేరకు కరపత్రాలను ముద్రించి పంపిణీ చేపట్టారు. ప్రత్యేకంగా ఆటోల ద్వారానూ ప్రచారం చేపట్టారు. గురువారం నుంచి అదనపు కమిషనర్ శ్రీహరిబాబు, డిప్యూటీ కమిషనర్ వెంకటేష్, ఎంహెచ్ఓ డాక్టర్ విష్ణుమూర్తి మూడు బృందాలుగా ఏర్పడి ప్లాస్టిక్ నియంత్రణపై స్పెషల్ డ్రైవ్ చేపట్టనున్నారు.

వివాహిత ఆత్మహత్య

గుమ్మఘట్ట: క్షణికావేశంలో ఓ వివాహిత ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు... గుమ్మఘట్ట మండలం గోనబావికి చెందిన అంజినప్పకు ఇద్దరు భార్యలు. పెద్ద భార్య పద్మక్క (55)కు సంతానం లేదు. చిన్న భార్యకు నలుగురు పిల్లలు ఉన్నారు. కొంత కాలంగా కుటుంబంలో కలహాలు చోటు చేసుకోవడంతో పద్మక్క తీవ్ర మనస్తాపానికి లోనైంది. ఈ క్రమంలో బుధవారం ఉదయం క్షణికావేశంలో ఆమె పురుగుల మందు తాగింది. అపస్మారక స్థితిలో పడి ఉన్న ఆమెను గమనించిన కుటుంబసభ్యులు వెంటనే రాయదుర్గంలోని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. చికిత్సకు స్పందించక ఆమె మృతి చెందింది. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

పాముకాటుతో ఇద్దరు మహిళల ఆస్పత్రి పాలు


చికిత్స పొందుతున్న సంధ్య

రాయదుర్గం టౌన్: పాముకాటుకు గురై ఇద్దరు మహిళలు ఆస్పత్రి పాలయ్యారు. బుధవారం ఉదయం గుమ్మఘట్ట మండలం రంగచేడు గ్రామానికి చెందిన లక్ష్మిని పాము కాటేసింది. గుర్తించిన కుటుంబసభ్యులు వెంటనే రాయదుర్గంలోని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. ప్రస్తుతం ఆమె కోలుకుంటోందని వైద్యులు తెలిపారు. అలాగే బుధవారం సాయంత్రం అడిగుప్ప గ్రామానికి చెందిన సంధ్యను ఇంటి వద్దనే పాము కాటేసింది. ఆమెను కూడా కుటుంబసభ్యులు రాయదుర్గంలోని ప్రభుత్వాస్పత్రిలో చేర్పించారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి


జయమ్మ (ఫైల్)

బెళుగుప్ప: పని ప్రాంతంలో గాయపడిన ఓ మహిళ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. వివరాలు... బెళుగుప్ప మండలం యలగలవంక గ్రామానికి చెందిన గొల్ల జయమ్మ (48) మూడు రోజుల క్రితం వ్యవసాయ పనుల నిమిత్తం పొలం గట్టు మీద నడుస్తూ అదుపు తప్పి కిందపడింది. ఘటనలో తలకు బలమైన గాయం కావడంతో స్థానికులు వెంటనే అనంతపురంలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. బుధవారం పరిస్థితి విషమించడంతో చికిత్సకు స్పందించక ఆమె మృతి చెందింది. ఘటనపై మృతురాలి కుమారుడు ప్రకాష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ శివ తెలిపారు. కాగా, ఏడాదిన్నర క్రితం ఆమె భర్త భీమసేన సైతం కళ్యాణదుర్గం సమీపంలోని దొడఘట్ట వద్ద చోటు చేసుకున్న ప్రమాదంలో మృతి చెందాడు.

విద్యుత్ మోటారు, పరికరాల అపహరణ

నల్లమాడ: మండల కేంద్రానికి చెందిన రైతు పఠాన్ అబ్దుల్ రఫీ మామిడి తోటలో మంగళవారం రాత్రి దుండగులు చొరబడి చోరీకి పాల్పడ్డారు. బోరుబావిలో అమర్చేందుకు తీసుకువచ్చిన 15 హెచ్‌పీ టెక్స్‌మో విద్యుత్ మోటారు, 200 మీటర్ల కేబుల్, ఇతర పరికరాలను రైతు కొనుగోలు చేసి తీసుకువచ్చి షెడ్డులో ఉంచాడు. మంగళవారం రాత్రి షెడ్డు తాళాలు బద్దలుగొట్టి లోపలకు ప్రవేశించిన దుండగులు విద్యుత్ మోటారుతో పాటు ఇతర పరికరాలు అపహరించుకెళ్లారు. బుధవారం ఉదయం కూలీలతో కలసి తోటలోకి వెళ్లిన రైతు చోరీ విషయాన్ని గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దాదాపు రూ.లక్ష మేర నష్టం వాటిల్లినట్లు వాపోయాడు.

గుర్తు తెలియని వృద్ధుడి మృతి



పెనుకొండ: పెనుకొండ నగర పంచాయతీ పరిధిలోని వెంకటాపురం తండా వద్ద బస్ స్టాప్‌లో బుధవారం ఉదయం గుర్తు తెలియని వృద్ధుడు మృతి చెందినట్లు ఎస్‌హెచ్ఓ దాదాపీర్ తెలిపారు. ఆయన అందించిన సమాచారం మేరకు.... గుర్తు తెలియని వృద్ధుడు (80) వెంకటాపురం తండా వద్ద ఉన్న బస్‌స్టాప్ వద్దకు చేరుకుని అక్కడే పడుకుని మరణించినట్లు తెలిపారు. మృతుని ఆచూకీ కోసం ప్రయత్నిస్తున్నామన్నారు. ప్రస్తుతం ప్రభుత్వ ఆస్పత్రిలో మృతదేహాన్ని ఉంచారని, మృతుని వివరాలు తెలిస్తే పెనుకొండ పోలీస్‌స్టేషన్‌ను సంప్రదించాలని కోరారు.

పుణ్యక్షేత్రాలకు ప్రత్యేక బస్సులు



హిందూపురం టౌన్: పుణ్యక్షేత్రాలైన కాశీ, అయోధ్యలకు హిందూపురం ఏపీఎస్ ఆర్టీసీ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా సూపర్ లగ్జరీ బస్సులను ఏర్పాటు చేసినట్లు హిందూపురం డిపో మేనేజర్ శ్రీకాంత్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 24న అయోధ్య, కాశీకి 8 రోజుల యాత్ర నిమిత్తం హిందూపురం నుంచి బస్సులు బయలుదేరుతాయన్నారు. అయోధ్య, కాశీ యాత్రకు రానుపోను ఒక్కొక్కరికి రూ.8,500 చార్జీ నిర్ణయించినట్లు తెలిపారు. పవిత్ర పుణ్యక్షేత్రాలను దర్శించుకోవాలనుకునే వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. టికెట్లు కావాల్సిన వారు సెల్ నంబర్ 9440834715ను సంప్రదించాలని కోరారు. అలాగే జూలై నెలలో 12వ తేదీ శుక్రవారం, ఆగస్టు నెలలో 9వ తేదీ శుక్రవారం హిందూపురం డిపో నుంచి అయోధ్య, కాశీకు బస్సులు అందుబాటులో ఉంటాయన్నారు.

క్లుప్తంగా

16న 'ఆకాశయానం' నవలావిష్కరణ

అనంతపురం కల్చరల్: కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత బండి నారాయణస్వామి రచించిన మరో నవల ఆకాశయానం ఈనెల 16వ తేదీన ఆవిష్కరించడం జరుగనుందని మధురకవి మల్లెల నరసింహమూర్తి, జిరసం ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి సురేష్ బుధవారం సంయుక్త ప్రకటనలో తెలిపారు. జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో స్థానిక ఎన్జీఓ హోమ్‌లో ఉదయం 10 గంటలకు జరిగే నవలావిష్కరణ సభకు విచ్చేయాలని సాహితీ అభిమానులను కోరారు.

తెలుగు జాతి ఆణిముత్యం 'సినారె'



సినారె చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న రచయితలు, కవులు

అనంతపురం కల్చరల్: తెలుగుజాతి సాహితీ ఆణిముత్యం సినారె అని పలువురు వక్తలు కొనియాడారు. బుధవారం స్థానిక విశాలాంధ్ర బుక్ హౌస్‌లో ప్రసిద్ధ కవి, రచయిత సి.నారాయణరెడ్డి వర్ధంతి సందర్భంగా అనంత రచయితలు, సాహితీ సంఘాల వ్యవస్థాపకులు నాగలింగయ్య, రియాజుద్దీన్, ఈరన్న, టీవీరెడ్డి, నానీల నాగేంద్ర, హరీష్, ప్రవీణ్ తదితరులు సినారె చిత్రపటం వద్ద ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జ్ఞానపీఠ్ అవార్డు గ్రహీతగా, సినీ గేయ రచయితగా, విమర్శకునిగా బహుముఖ ప్రజ్ఞతో తెలుగు వారి హృదయాల్లో చిరస్మరణీయుడిగా నిలిచిపోయిన సినారె జీవితం ఆదర్శప్రాయమన్నారు. నాగార్జున సాగరం, వసంత కర్పూర రాయలు, మట్టిమనిషి ఆకాశం, రుతుచక్రం, ప్రపంచ పదులు, సినారె గజల్స్ వంటి అనేక కావ్యాల ద్వారా ఎంతో మందికి స్ఫూర్తినిచ్చిన ఆ కలం తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేసిందన్నారు. మానవతావాదిగా ఆయన కావ్యాలు అజరామరమని కొనియాడారు.

మండలానికి చేరిన పుస్తకాలు

చెన్నేకొత్తపల్లి: మండల వ్యాప్తంగా ప్రభుత్వ బడుల్లో చదువుకుంటున్న విద్యార్థులకు అందజేసేందుకు ఇప్పటి వరకూ 23,004 పాఠ్య పుస్తకాలు ఎమ్మార్సీకి చేరినట్లు మండల విద్యాశాఖ అధికారి–2 ప్రసన్నకుమార్ నాయుడు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. అలాగే 23,120 నోట్‌బుక్స్ కూడా వచ్చినట్లు పేర్కొన్నారు. వీటిని 6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు మాత్రమే అందజేయడం జరుగుతుందన్నారు. మండల వ్యాప్తంగా ఏపీ మోడల్ స్కూల్, కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలతో కలిపి మొత్తం 9 ఉన్నత పాఠశాలలు, 4 ప్రాథమికోన్నత పాఠశాలలు, 44 ప్రాథమిక పాఠశాలలు ఉన్నట్లు పేర్కొన్నారు.

రైతులకు ఉచితంగా పండ్ల మొక్కలు

కుందుర్పి: మండలంలోని కుసుమగిరి రైతు ఉత్పత్తి దారుల కంపెనీ లిమిటెడ్ ఆధ్వర్యంలో రైతులకు ఉచితంగా పండ్ల మొక్కలు పంపిణీ చేస్తున్నట్లు ఆ సంఘం మండల కో–ఆర్డినేటర్ నరసింహ మూర్తి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే 50 వేల పండ్ల మొక్కలు పంపిణీకి సిద్ధం చేసినట్లు వెల్లడించారు. నేరేడు, ఉసిరి, జామ, కానుగ, చింత, సపోటా మొక్కలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. మొక్కలను ఉచితంగా ఇవ్వడమే గాక పొలాల్లో మొక్కలు నాటేందుకు గుంతలను సైతం సొంత ఖర్చుతో తీయించి మొక్కలు నాటిస్తామన్నారు. ఆసక్తి కలిగిన రైతులు కుందుర్పిలోని తమ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

శుభ్రతతో పుండ్లకు చెక్

కూడేరు: కుష్టు వ్యాధిగ్రస్తులు తమ కాళ్లు, చేతి వేళ్లను రోజూ నీటితో శుభ్రం చేసుకుంటే పుండ్లు కాకుండా అరికట్టవచ్చని డీపీఎంఓ తిప్పేస్వామి అన్నారు. బుధవారం మండల పరిధిలోని కుష్టు రోగుల కాలనీలో వైకల్య నివారణ, పునరావస శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా కాళ్లు, చేతి వేళ్లు పుండ్లు కాకుండా టబ్ నీటిలో ఏ విధంగా శుభ్రం చేసుకోవాలో అవగాహన కల్పించారు. ప్రాథమిక దశలోనే కుష్టు వ్యాధి లక్షణాలను గుర్తించి చికిత్స పొందితే పూర్తిగా నయం చేయవచ్చని సూచించారు. అనంతరం పాదరక్షలు, మందులను ఉచితంగా అందజేశారు.

సరదా.. కారాదు విషాదం

ఈ పక్కనున్న ఫొటోలో కనిపిస్తున్న నీటి కుంట ఇద్దరి ప్రాణాలను బలిగొంది. మండలంలోని వడ్డుపల్లి టోల్‌గేట్‌కు సమీపంలో ఉన్న నీటి కుంట ఇటీవల వరుసగా కురుస్తున్న వర్షాలకు పూర్తిగా నిండిపోయింది. ఈనెల 9వ తేదీన అనంతపురంలోని నాలుగవ రోడ్డుకు చెందిన రాజగోపాల్ (38) కుమారుడు వశిష్ట (8), భార్య అపర్ణతో కలిసి పంపనూరుకు వచ్చారు. సుబ్రహ్మణ్యేశ్వరుడి దర్శనం అనంతరం అనంతపురానికి బయలుదేరారు. ఈ క్రమంలో వడ్డుపల్లి టోల్‌గేట్‌కు సమీపంలో ఉన్న కుంట వద్ద ద్విచక్ర వాహనాన్ని ఆపారు. కుమారుడు వశిష్ట సరదాగా కుంట దగ్గరికి వెళ్లి జారి పడిపోయాడు. కుమారుడిని రక్షించే క్రమంలో తండ్రి రాజగోపాల్ కుంటలోకి దిగాడు. ఇద్దరికీ ఈత రాకపోవడంతో ప్రాణాలు కోల్పోయారు.

- వర్షాలకు నిండిన కుంటలు, వంకలు
- ఆడుకునేందుకు దిగి ప్రాణాలు కోల్పోతున్న వైనం
- జాగ్రత్తగా లేకపోతే ప్రాణాలకు ముప్పు



వడ్డుపల్లి టోల్‌గేట్ వద్ద రోడ్డు పక్కనే ప్రమాదకరంగా ఉన్న నీటి కుంట

ఆత్మకూరు: నైరుతి రుతుపవనాల ప్రభావంతో వారం రోజులుగా వర్షాలు విస్తారంగా కురుస్తున్నాయి. మండలంలోని నీటి కుంటలు, పెద్ద పెద్ద గుంతలు, వాగులు, చెక్ డ్యాంలు నీటితో నిండిపోయాయి. ఎక్కడ, ఏ గుంతలో చూసినా నీరు ఉండటంతో జాగ్రత్తగా ఉండకపోతే ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయి. చాలా మంది పిల్లలు ఆడుకునేందుకు గ్రామ సమీపంలోని పొలాల వద్దకు వెళ్తుంటారు. నీరు అధికంగా ఉండటంతో కాలు జారి పడితే అంతే సంగతులు. పిల్లలకు ఈత రాకపోవడంతో నీరు ఎన్ని ఉన్నాయో తెలియక, గుంతల లోతు అంచనా వేయక కుంటల్లోకి దిగుతున్నారు. తెలిసీ తెలియని వయస్సులో పిల్లలు ఇలా వాగులు, వంకల్లో ఆడుకునేందుకు వెళ్తున్నారు. ఈత రాకపోవడంతో ప్రాణాలు కోల్పోతున్నారు. తల్లిదండ్రులకు శోకం మిగుల్చుతున్నారు.

జాగ్రత్తలు చెప్పాల్సింది తల్లిదండ్రులే..

ప్రస్తుతం కురిసిన వర్షాలకు ఎక్కడ చూసినా, నీరే ఉండటంతో ఈత రాని పిల్లలకు ప్రమాదకరమే అని చెప్పవచ్చు. అంతేకాకుండా కుంటల్లో, వాగుల్లో వర్షపు నీటితో పాటు బురద కూడా ఉండటంతో నీటిలో ఇరుక్కు పోయే ప్రమాదం ఉంటుంది. నీటి గుంతలు, నీరు ఎక్కువగా ఉన్న ప్రదేశాలకు వెళ్లరాదని తల్లిదండ్రులే పిల్లలకు జాగ్రత్తలు తెలియజేయాలి. ఇలాంటి ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు పిల్లలకు వేసవి సెలవుల్లో ఈత నేర్పించడం ఎంతో మంచిది. ఒక వేళ నీటిలో మునిగితే ఏం చెయ్యాలి? ఎలా బయటకు రావాలన్న విషయాలను వివరించాలి. వర్షాకాలంలో ఎట్టి పరిస్థితుల్లో వాగులు, వంకలు, గుంతలు వద్దకు పిల్లల్ని పంపరాదు.

అప్రమత్తతే శ్రీరామరక్ష..

అనంతపురం నుంచి పంపనూరుకు వచ్చే భక్తుల సంఖ్య ప్రతి ఆది, మంగళవారాల్లో అధిక సంఖ్యలో ఉంటుంది. దీంతో చాలా మంది తమ పిల్లలతో ద్విచక్ర వాహనాల్లో వస్తుంటారు. ముఖ్యంగా పంపనూరు వద్ద హంద్రీ–నీవా పెద్ద కాలువ ఉంది. ఈ కాలువల్లో ఆత్మకూరు మండలానికి సంబంధించిన వారే కాకుండా చాలా మంది ఈత కొట్టేందుకు దిగి ప్రాణాలు కోల్పయిన సంఘటనలు ఉన్నాయి. అంతేకాకుండా అనంతపురం నుంచి వచ్చే మార్గంలో వడ్డుపల్లి టోల్‌గేట్ వద్ద పీఏబీఆర్ కాలువ కూడా ఉంది. పక్కనే చెక్ డ్యాం కూడా ఉంది. చాలా మంది పర్యాటకులు వాహనాలు ఆపి మరీ ఈత కొట్టడం లేదా నీళ్ల దగ్గర పిల్లలతో ఆడుకోవడం చేస్తుంటారు. ఈత రాకున్న వారు ఇలా చేయడం వల్ల ప్రాణాలు పోగొట్టుకునే పరిస్థితి వస్తుంది. పర్యాటకులు కాలువ దగ్గర కాని, చెక్ డ్యాంల వద్ద కాని నీళ్ల వద్దకు వెళ్ల రాదని పోలీసులు హెచ్చరిస్తున్నారు.



నీటిలోకి వెళ్లరాదని పోలీసులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

ఫ్లెక్సీ ఏర్పాటు..

వడ్డుపల్లి వద్ద టోల్‌గేట్ సమీపంలో రోడ్డుకు పక్కనే నీటి కుంట వద్దకు పర్యాటకులు, స్థానికులు వెళ్లకుండా ఆత్మకూరు పోలీసులు చర్యలు తీసుకున్నారు. ఆ నీటి కుంట వద్ద రోడ్డు పక్కనే 'ప్రమాదకరమైన గుంతలు కలవు. నీటిలో దిగడం, ఈత కొట్టడం, వంటివి చేయకూడదని ఫ్లెక్సీ కూడా ఏర్పాటు చేశారు.

కనుల పండువగా కల్యాణోత్సవం



ప్రత్యేక అలంకరణలో ఉత్సవ విగ్రహాలు

ఆత్మకూరు: పంపనూరులోని సర్పరూప సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో బుధవారం జ్యేష్ఠశుద్ధ షష్ఠి సందర్భంగా కల్యాణోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో శ్రీవల్లి, దేవసేన, సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా పట్టు వస్త్రాలు, బంగారు ఆభరణాలతో అలంకరించారు. అనంతరం మేళతాళాలు, వేద పండితుల మంత్రోచ్చారణలు, పసుపు, కుంకుమ కలిపిన అక్షింతలతో కల్యాణం జరిపించారు. అనంతరం సుబ్రహ్మణ్యేశ్వరుడి మూల విరాట్‌ను ప్రత్యేకంగా అలంకరించారు. పంచామృతాభిషేకాలు, విశేష పూజలు చేశారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు.



పూజలందుకున్న సుబ్రహ్మణ్యేశ్వరుడు

ముమ్మరంగా దోమకాటు నివారణ చర్యలు

- వసతి గృహాల్లో మలాథియన్ స్ప్రేయింగ్
- పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించిన అధికారులు

అనంతపురం కార్పొరేషన్: జిల్లా అధికార యంత్రాంగం దోమకాటు నివారణ చర్యలపై ప్రత్యేక దృష్టి సారించింది. జూన్ 1 నుంచి 30వ తేదీ వరకు మలేరియా వ్యతిరేక మాసోత్సవాల్లో భాగంగా నగరపాలక సంస్థ, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ సమన్వయంతో ముందుకెళ్తున్నారు. నగరంలోని వివిధ ప్రాంతాల్లో దోమకాటు నివారణ చర్యలు చేపట్టారు. ఇప్పటి వరకు నగరంలో రెండు డెంగీ కేసులు నమోదయ్యాయి. కేసులు అధికం కాకుండా అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు.

జ్వర పీడితులపై ఆరా..

మేయర్ వసీం, కమిషనర్ మేఘస్వరూప్ ఆదేశాలతో ఎంహెచ్‌ఓ డాక్టర్ విష్ణుమూర్తి పర్యవేక్షణలో నగరంలోని 50 డివిజన్లలోని 74 సచివాలయాల పరిధిలో ఆరోగ్య కార్యదర్శులు జ్వర పీడితులపై ఆరా తీస్తున్నారు. దీంతో పాటుగా వారంలో ఒక రోజు డ్రైడే పాటించి, వివిధ ప్రాంతాల్లో పారిశుధ్యం మెరుగుకు చర్యలు తీసుకుంటున్నారు. ప్రధానంగా దోమలు వృద్ధి చెందకుండా నీరు నిల్వ ఉన్న తొట్టెలు, కుండలు, తదితర వాటిలో ఉన్న నీటిని తొలగిస్తున్నారు. అదేవిధంగా నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో పారిశుధ్య సిబ్బంది ఆయిల్‌బాల్స్ వేస్తున్నారు. తద్వారా దోమలు లార్వా దశలోనే మృతి చెంది, వృద్ధి కాకుండా ఉంటాయి. నగరంలోని వివిధ ప్రాంతాల్లో రోజూ ఫాగింగ్, స్ప్రేయింగ్ చేయించేలా చర్యలు తీసుకుంటున్నారు. నగరంలోని 500 మందికి పైగా పారిశుధ్య కార్మికులు చెత్త సేకరణ, పారిశుధ్యం మెరుగు పనుల్లో నిమగ్నమయ్యారు.



ప్రభుత్వ బాలికల వసతి గృహంలో స్ప్రేయింగ్ చేస్తున్న దృశ్యం

పూడికతీత పనులు

నగరంలోని నడిమివంక, మరువంకతో పాటు వివిధ ప్రాంతాల్లోని పెద్ద కాలువలు, చిన్నకాలువల్లో పూడికతీత పనులు వేగవంతం చేశారు. జేసీబీల సహాయంతో పూడికను ఎప్పటికప్పుడు తొలగిస్తున్నారు. అదే విధంగా సక్షన్ మిషన్ ద్వారా కాలువలు బ్లాక్ అయిన ప్రాంతాల్లో పూడికను తొలగించేలా చర్యలు తీసుకుంటున్నారు.

వసతి గృహాల్లో పారిశుధ్య పనుల జోరు..

దోమకాటు నివారణ చర్యల్లో భాగంగా బుధవారం నగరంలోని గిల్డ్ ఆఫ్ సర్వీస్ స్కూల్ సమీపంలో ఉన్న బీసీ, ఎస్సీ ప్రభుత్వ బాలికల వసతి గృహాల్లో దోమకాటు నివారణ చర్యలు చేపట్టారు ఆరోగ్యశాఖ, నగరపాలక సంస్థ అధికారులు, ఎంహెచ్‌ఓ డాక్టర్ విష్ణుమూర్తి, మలేరియా సబ్ యూనిట్ అధికారి మద్దయ్య పర్యవేక్షణలో వసతి గృహాల్లో మలాథియన్ స్ప్రే చేశారు. కార్యక్రమంలో జిల్లా సహాయ మలేరియా అధికారి సత్యనారాయణ, మలేరియా సబ్ యూనిట్ సూపర్‌వైజర్లు నూర్‌బాషా, శ్రీధర్‌మూర్తి, వసతి గృహ సంరక్షకులు వసంత, అనిత, నాగార్జున రెడ్డి, ఆశావర్కర్ భారతి పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడి



సూచనలిస్తున్న వ్యవసాయశాఖ శాస్త్రవేత్తలు

ఆత్మకూరు: ఖరీఫ్ సీజన్‌లో యాజమాన్య పద్ధతులతో పంటలు సాగు చేస్తే అధిక దిగుబడులు సాధించొచ్చని జిల్లా వనరుల కేంద్రం ప్రాజెక్టు డైరెక్టర్ మద్దిలేటి, శాస్త్రవేత్తలు శశికళ, శైలజ కుమారి రైతులకు సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని రైతు భరోసా కేంద్రంలో రైతులకు వ్యవసాయ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వేరుశనగ, కంది, ఆముదం పంటల సాగులో శాస్త్రీయ యాజమాన్య పద్ధతులు అవలంభించాలన్నారు. మేలైన విత్తనం ఎంపిక, విత్తన శుద్ధి, సమగ్ర ఎరువులు, సస్యరక్షణ మొదలైన విషయాలను వివరించారు. అనంతరం గత ఏడాది 2023 సంవత్సరానికి సంబంధించి వేరుశనగ నష్టపరిహారం మంజూరులో బ్యాంక్ సమాచారం పొరపాటు వల్ల మండలంలో 900 మంది రైతులకు పంట నష్టపరిహారం కాలేదన్నారు. ఈ రైతులకు సంబంధించిన బ్యాంక్ ఖాతాలను రైతు భరోసా కేంద్రాల్లో అందజేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఏడీఏ శ్రీనివాస్, ఏఓ సుచరిత, ఏఈఓ సుజిత, ప్రసాద్, రైతు భరోసా సిబ్బంది భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరా పాహిమాం



శివబాలయోగి ఆశ్రమంలో పూజలందుకున్న సుబ్రహ్మణ్యేశ్వరుడు



హెచ్చెల్సీ కాలనీలోని మంజునాథ అన్నపూర్ణ ఆలయంలో అలంకార సేవలు

అనంతపురం కల్చరల్: సుబ్రమణ్యేశ్వర పాహిమాం అంటూ భక్తుల నామస్మరణతో కుమార స్వామి బుధవారం విశేష పూజలందుకున్నాడు. జ్యేష్ఠశుద్ధ షష్ఠి సందర్భంగా పలుచోట్ల విశేష పూజలు, కల్యాణోత్సవాలు కమనీయంగా జరిగాయి. నగరంలోని హెచ్చెల్సీ కాలనీలోని అన్నపూర్ణ మంజునాథేశ్వర ఆలయంలో సుబ్రమణ్యేశ్వరుడికి విశేష పూజలు నిర్వహించారు. ప్రధాన అర్చకుడు బసవరాజ స్వామి ఆధ్వర్యంలో అభిషేకాలు, అలంకార సేవల్లో స్వామి భక్తులకు దర్శనమిచ్చాడు. అధిక సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకున్నారు. అదేవిధంగా నగర శివారులోని శివబాలయోగి ఆశ్రమంలో శ్రీవల్లి సమేత సుబ్రమణ్యేశ్వరుడికి పంచామృతాభిషేకాలు, అర్చనలు చేపట్టారు. జూటూరు అరవింద్, రత్నగిరి దేవరాజ్ ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ జరిగింది. చెరువుకట్ట, మారుతీనగర్ తదితర చోట్ల షష్ఠి వేడుకలు భక్తిశ్రద్ధలతో సాగాయి.

చంద్రబాబు ప్రమాణ స్వీకారం ప్రత్యక్ష ప్రసారం

- వీక్షించిన కలెక్టర్ వినోద్‌కుమార్, అధికారులు



సీఎంగా చంద్రబాబు నాయుడు చేస్తున్న ప్రమాణ స్వీకారాన్ని ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షిస్తున్న కలెక్టర్ వినోద్ కుమార్, అధికారులు

అనంతపురం అర్బన్: రాష్ట్ర ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబునాయుడు, మంత్రిగా పయ్యావుల కేశవ్ బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. కృష్ణా జిల్లా కేసరిపల్లిలోని ఐటీ టవర్ వద్ద ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమాన్ని కలెక్టరేట్‌లోని రెవెన్యూభవన్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యక్ష ప్రసారం ద్వారా కలెక్టర్ వి.వినోద్‌కుమార్ వీక్షించారు. కలెక్టర్‌తో పాటు జెడ్పీ సీఈఓ వైఖోమ్ నిదియాదేవి, నగర పాలక సంస్థ కమిషనర్ మేఘ స్వరూప్, అసిస్టెంట్ కలెక్టర్ బి.వినూత్న, సీపీఓ అశోక్ కుమార్‌రెడ్డి, డీటీసీ వీర్రాజు, సాంఘిక సంక్షేమ శాఖ జేడీ మధుసూదన్, డీఎంహెచ్‌ఓ భ్రమరాంబదేవి, ఎస్పీడీసీఎల్ ఎస్ఈ సురేంద్ర, డీఆర్‌డీఏ, డ్వామా, మెప్మా పీడీలు నరసింహారెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, విజయలక్ష్మి, బీసీ సంక్షేమ శాఖ డీడీ కుష్బూకోఠారి, డీసీఓ అరుణకుమారి, డీపీఎం ఆనంద్, ఉద్యాన శాఖ డీడీ రఘునాథరెడ్డి, పౌర సరఫరాల సంస్థ డీఎం రమేష్‌రెడ్డి, జిల్లా సరఫరాల అధికారి శోభారాణి, గిరిజన సంక్షేమ శాఖ అధికారి రామాంజినేయులు, డీఈఓ వరలక్ష్మి, డీఎల్‌డీఓ ఓబులమ్మ, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

చిన్నపిల్లలతో పని చేయించడం నేరం

అనంతపురం కల్చరల్: పుస్తకాలు పట్టాల్సిన చేతికి పలుగులు, పరకలిచ్చి పని చేయించుకోవడం చట్టరీత్యానేరం. అయినా చాలా చోట్ల బాలకార్మికులు ఉండటం ఆవేదన కల్గిస్తోందని సీఆర్‌డీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ సద్దాం బాషా అన్నారు. ప్రపంచ బాలకార్మికుల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా నగరంలోని క్రీసెంట్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో బుధవారం నగర వీధుల్లో అవగాహన ర్యాలీ చేపట్టారు. స్థానిక రామ్‌నగర్ నుంచి కోవూరు నగర్ వరకు సాగిన ర్యాలీలో సద్దాం బాషా మాట్లాడారు. షాపుల్లో, ఇళ్లలో, భవన నిర్మాణాల్లో చిన్నారుల చేత పని చేయించకుండా వారికి చదువుకునే అవకాశాన్ని కల్పించాలన్నారు. బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించి అందరికి అక్షర జ్ఞానం అందేలా చూడడం అందరి బాధ్యత అన్నారు. బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు కృషి చేద్దామని పిలుపునిచ్చారు. అంతకు ముందు బాలబాలికలు ఫ్లెక్సీలు, ప్లకార్డులతో నినాదాలు చేస్తూ ర్యాలీతో పాటూ మానవహారాలు చేపట్టి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రెయిన్‌బో హోం ప్రతినిధులు శ్రావణి, పుష్పలత, శిల్ప, విశ్వనాథ్, మమత, సావిత్రి తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ చేపట్టిన అనాథాశ్రమం చిన్నారులు

రూ.2 కోట్లతో నృసింహుడి ఆలయ నిర్మాణం



అలంకరణలో లక్ష్మీనృసింహుడు



ఆలయ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న వేద పండితులు

చెన్నేకొత్తపల్లి: మండల కేంద్రంలో బుధవారం ఓబుళ లక్ష్మీ నృసింహ స్వామి నూతన దేవాలయ నిర్మాణానికి వేద పండితులు భూమిపూజ చేశారు. ఓబుళ లక్ష్మీనృసింహుడి ఆలయం శిథిలావస్థకు చేరుకోవడంతో పాత దేవాలయాన్ని తొలగించారు. ఆ స్థానంలో నూతన దేవాలయాన్ని నిర్మించాలని ఆలయ కమిటీ సభ్యులు తీర్మానించారు. దాతలు, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తుల సహకారంతో రూ.2 కోట్ల వరకూ విరాళాలు సేకరించారు. అహోబిలం లక్ష్మీనృసింహ స్వామి దేవస్థానం ప్రధాన అర్చకుడు మధు స్వామితో పాటు మరో ఇద్దరు అర్చకుల ఆధ్వర్యంలో ఘనంగా భూమిపూజ జరిగింది. అంతకుముందు స్వామి ఉత్సవ విగ్రహానికి ప్రత్యేక పూజలు చేపట్టారు. త్వరలో ఆలయ నిర్మాణ పనులను ప్రారంభిస్తామని ఆలయ కమిటీ సభ్యుడు శివ తెలిపారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

బాడుగకు వ్యవసాయ పనిముట్లు

కళ్యాణదుర్గం: రైతులకు బాడుగకు వ్యవసాయ పనిముట్లను అందజేయనున్నట్లు కళ్యాణదుర్గం కేవీకే కో–ఆర్డినేటర్ డాక్టర్ సి.రాధాకుమారి తెలిపారు. బుధవారం ఆమె మీడియాతో మాట్లాడారు. వ్యవసాయ పనిముట్లు కావాల్సిన రైతులు కార్యాలయం పని దినాల్లో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల్లోపు కేవీకేలో సంప్రదించాలన్నారు. అడ్వాన్స్‌గా రూ.5 వేలు చెల్లించాలన్నారు. పూర్తి వివరాలకు 8919099476, 9052443737 నంబర్లకు సంప్రదించాలని కోరారు.

బాడుగకు లభించే పనిముట్ల వివరాలు..

పనిముట్లు	ఒక్క రోజు బాడుగ
కిసాన్ విత్తనం గొర్రు	రూ.1,000
ట్రాక్టర్ స్ప్రేయర్	రూ.800
బాతుకాళ్ల మడక	రూ.800
బెడ్ల గుంటక	రూ.500
పవర్ వీడర్	రూ.500